## బుర్రా సాయిమాధవ్‌కు పురస్కారం



సాయిమాధవ్‌ను ఆత్రేయ రచనా పురస్కారంతో సత్కరిస్తున్న వక్తలు

రవీంద్రభారతి, మే 7: సారిపల్లి కొండలరావు ఆధ్వర్యంలో యువకళా వాహిని నిర్వహణలో బుధవారం రవీంద్రభారతిలో సుప్రసిద్ధ సినీ రైటర్ బుర్రా సాయిమాధవ్‌కు మనసుకవి ఆత్రేయ రచనా పురస్కార ప్రదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయ మూర్తులు డాక్టర్ రాధారాణి, డాక్టర్ మామిడి హరికృష్ణ, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, సీఎల్ఎన్ గాంధీ, పి.జ్యోతి, ఎస్వీ రామారావు విచ్చేసి సాయిమాధవ్‌కు ఆత్రేయ రచనా పురస్కారం అందజేశారు. అనంతరం ఘనంగా సన్మానించారు.

## డేవిడ్ ఫ్రాన్సిస్‌కు అభినందనలు



డేవిడ్ ఫ్రాన్సిస్‌ను అభినందిస్తున్న రాష్ట్ర క్రీడాకారులు

కాచిగూడ, మే 7: ఇండోనేపాల్‌లోని రంగశాల స్టేడియం పోఖ్రాలో ఈ నెల నుంచి 7 వరకు జరిగిన ఇంటర్ నేషనల్ సౌత్ ఏషియన్ గేమ్స్‌లో హైదరాబాద్‌కు చెందిన విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు డేవిడ్ ఫ్రాన్సిస్ సత్తా చాటారు. ఈ పోటీల్లో నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, థాయిలాండ్, ఆఫ్ఘనిస్థాన్ దేశాలు పాల్గొన్నాయి. ఇండియా నుంచి 74 సంవత్సరాల డేవిడ్ ఫ్రాన్సిస్ లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రోలో పాల్గొని మూడు బంగారు పథకాలు సాధించాడు. నేషనల్ గేమ్స్‌లో పాల్గొని సత్తా చాటిన డేవిడ్ ఫ్రాన్సిస్‌ను రాష్ట్ర క్రీడాకారులు అభినందించారు.

# యుద్ధ సన్నద్ధతపై పలుచోట్ల మాక్‌డ్రిల్స్

- పాల్గొన్న నాంపల్లి, కార్వాన్ ఎమ్మెల్యేలు
- ప్రజలకు అవగాహన కల్పించిన అధికారులు

కార్వాన్, మే 7: పాకిస్తాన్‌తో యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో దేశంలో అత్యవసర పరిస్థితులు ఎదురైన సమయంలో నగర ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం నానల్‌నగర్‌లోని ఎవ్లాన్ అపార్ట్ మెంట్‌లో నగర పోలీసులతో పాటు రెవెన్యూ, జీహెచ్ఎంసీ, అగ్నిమాపకశాఖ, వైద్య విభాగం అధికారులు కలిసి మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులు, విద్యార్థులు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొని యుద్ధ సమయంలో నివాస ప్రాంతంలో ఏదైనా అత్యవసర పరిస్థితులు ఎదురైనపుడు ప్రజలు ఎలా స్పందించాలి?, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?, గాయాలకు గురైన వారిని దవాఖానాకు ఎలా తరలించాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. సౌత్ వెస్ట్‌జోన్ డీసీసీ చంద్రమోహన్ ఆధ్వర్యంలో పలువురు ఏసీపీలు, సీఐలు పాల్గొన్నారు.కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయి నుద్దీన్, నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్, కార్వాన్ డివిజన్ కార్పొరేటర్ ఎం.స్వామి యాదవ్, నానల్‌నగర్ కార్పొరేటర్ నసీర్‌తో పాటు పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.



చార్మినార్ : మంటలను అర్పడంపై ఆసుపత్రి సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**కాచిగూడ రైల్వేస్టేషన్‌లో..**

కాచిగూడ : భారత్–పాకిస్థాన్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం కాచిగూడ రైల్వే స్టేషన్‌లో రైల్వే సివిల్ డిఫెన్స్ కంట్రోలర్ ఉదయ్ నాథ్ కోట్ల పర్యవేక్షణలో మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి రైలు ప్రయాణికులతో పాటు యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దక్షిణ మధ్య రైల్వే డిఫెన్స్ ఫోర్స్, జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు, ఆపరేటింగ్ డిపార్ట్మెంట్, విద్యుత్, ఎస్ఎన్‌టీ మెడికల్, ఇంజనీరింగ్, తదితర రైల్వే విభాగాలకు చెందిన ఉద్యోగులు దాదాపు 40 నిమిషాల పాటు కాచిగూడ రైల్వే స్టేషన్ ఫ్లాట్ ఫారం–1 లో నిర్వహించిన ఈ మాక్ డ్రిల్‌లో పాల్గొన్నారు. ఈ మాక్ డ్రిల్ యుద్ధ వాతావరణం కళ్లకు కట్టినట్లుగా చూపించారు. సైరన్ మోతతో ప్రారంభమై యుద్ధ సమయంలో శత్రుదేశం రైల్వే స్టేషన్‌లపై బాంబులు వేస్తే ప్రయాణికులకు మంటలు అంటుకుంటే ఏ విధంగా ఆర్పివేయాలో చూపించిన అనేక దృశ్యాలు అందరిని ఆశ్చర్యపరిచాయి. రైల్వే ఎస్పీ చందనదీప్తి(ఐపీఎస్), రైల్వే డీఎస్పీ జావేద్, రాజ్‌దుర్రై, కేఎల్ఎన్ స్వామి, కాచిగూడ స్టేషన్ డైరెక్టర్ కె.బాలాజీ, రైల్వే సీఐ ఎల్లప్ప, ఆర్పీఎఫ్ సీఐ మాల్, తదితరులు పాల్గొన్నారు.



నానల్‌నగర్ ఎవ్లాన్ అపార్ట్‌మెంట్‌లో నిర్వహించిన మాక్‌డ్రిల్ దృశ్యాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు కౌసర్ మొయినుద్దీన్, మాజిద్ హుస్సేన్, తదితరులు

**ఆసుపత్రిలో మాక్‌డ్రిల్..**

చార్మినార్ : అత్యవసర సమయాల్లో వ్యవహరించాల్సిన పరిస్థితులపై మొఘల్‌పుర అగ్నిమాపక అధికారులు ఆసుపత్రి సిబ్బందికి మెళకువలు నేర్పించారు. దేశ వ్యాప్తంగా ప్రస్తుతం నెలకొన్న అత్యవసర పరిస్థితుల నేపథ్యంలో పురాణహవేలిలోని దురేషవార్ ఆసుపత్రి పారామెడికల్ సిబ్బందితోపాటు ఆసుపత్రి ఇతర సిబ్బందికి మాక్‌డ్రిల్ నిర్వహించి ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాలు ఎలా కాపాడుకోవాలి, ఇతరులను ఎలా రక్షించాలనే అంశంపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాద సమయంలో మంటలను ఎలా అదుపు చేయవచ్చో తెలియజేస్తూ ఆసుపత్రి సిబ్బందిచే పరికరాల వినియోగాన్ని నిర్వహింపజేశారు.కార్యక్రమంలో ఫైర్‌స్టేషన్ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డితోపాటు నాగయ్య, వినోద్‌కుమార్, భీంరావు,కరణ్‌సింగ్,హర్షద్,లోకేశ్వర్, సుధా కర్, నదీమ్ తదితరులు పాల్గొన్నారు.



కాచిగూడ : మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న రైల్వే డిఫెన్స్ కంట్రోలర్ ఉదయ్‌నాథ్, స్టేషన్ డైరెక్టర్ బాలాజీ

## పోస్ట్‌కార్డు కథలకు ఆదరణ పెరిగింది..



గ్రంథావిష్కరణలో పాల్గొన్న సాహితీవేత్తలు

తెలుగు యూనివర్సిటీ, మే 7: సుప్రసిద్ధ సాహితీవేత్తలు సమాజానికి సందేశం అందించేలా రాసిన పోస్ట్‌కార్డు కథల గ్రంథం చిరుకథల చిద్విలాసం ప్రతి ఒక్కరూ చదవాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి సూచించారు. జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ సాహితీవేత్త గుదిబండి వెంకట రెడ్డి సంపాదకత్వంలో సాహితీ కిరణం ప్రచురించిన చిరుకథల చిద్విలాసం గ్రంథావిష్కరణ సభ బుధవారం రెడ్‌హిల్స్‌లోని నఫీజ్ రెసిడెన్సీలోని రమణాచారి కార్యాలయంలో జరిగింది. ముఖ్య అతిథిగా రమణాచారి పాల్గొని గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. పోస్ట్‌కార్డు కథల ప్రాధాన్యం పెరిగిందని, ఈ కథలను సాహితీవేత్తలు విరివిగా రాయాలని ఆకాక్షించారు.

## ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం



అతిథులను సత్కరిస్తున్న సంస్థ నిర్వాహకులు రాధిక, ఇతర వక్తలు

రవీంద్రభారతి, మే 7: సులోచన కళాక్షేత్రం వార్షిక వేడుకలు బుధవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డా.వేదాంతం రాధేశ్యామ్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి, సీసీ ఎస్‌సీఐ పద్మపల్లి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ తదితరులు విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి వార్షికోత్సవ వేడుకలను ప్రారంభించి, పలువురి నాట్యకారిణులకు, ప్రముఖులకు సన్మానంతో పాటు మెమెంటోలు బహూకరించారు. సులోచన కళాక్షేత్రం నృత్యకారిణులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు వి.రాధిక,కే.రేవతి తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన హరిరామ్ కస్టడీ

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, మే 7 (నమస్తే తెలంగాణ) : సంపాదనకు మించి అక్రమ ఆస్తులను ఆర్జించిన కేసులో నిందితుడు భూక్యా హరిరామ్ 5రోజుల కస్టడీ బుధవారం ముగియడంతో ఏసీబీ కోర్టు ఎదుట అధికారులు హాజరుపర్చారు. ఆసుపత్రిలో చికిత్సలు చేయించిన అనంతరం నేరుగా నాంపల్లిలోని ఏసీబీ కోర్టుకు తీసుకువచ్చారు. కస్టడీలో పోలీసులు థర్డ్ డిగ్రీ వాడారా? గాయాలేమైనా ఉన్నాయా? అని కోర్టు నిందితుడిని ప్రశ్నించగా అలాంటిదేమీ జరగలేదని సమాధానం తెలపడంతో జ్యుడీషియల్ కస్టడీకి తరలిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో నీటి పారుదల శాఖ గజ్వేల్ ఈఎన్‌సీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సమయంలో అవినీతికి పాల్పడినట్టు నిందితుడిపై అభియోగాలు ఉన్నాయి. జలసౌధ మొదటి అంతస్తులోని ఈఎన్సీ కార్యాలయంతో పాటు కాళేశ్వరం సాగునీటి ఎత్తిపోతల ప్రాజెక్టు కార్పొరేషన్ కార్యాలయంలో బృందాల వారిగా తనిఖీలు నిర్వహించి కీలక ఆధారాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాటికి సంబంధించిన దస్త్రాలు, రశీదులు, ధృవపత్రాలకు చెందిన సమాచారాన్ని నిందితుడినుంచి సేకరించిన విషయాలను నేరాంగీకార పత్రంలో నమోదు చేసి కోర్టుకు సమర్పించారు. బీనాబీ పేరుతో పలు రిజిస్ట్రేషన్ల వివరాలను సైతం రాబట్టిన అధికారులు ఆధారాలను పేర్కొన్నారు. నిందితుడికి బినామీగా ఓ స్థిరాస్థి వ్యాపారి వ్యవహరించిన కీలక ఆధారాలను కూడా వివరించారు. విచారణ కొనసాగిస్తున్నట్టు ఏసీబీ అధికారులు తెలిపారు.

## ఇంటర్నల్ మార్కుల జాబితాను సమర్పించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని డిగ్రీ కోర్సుల రెండో సెమిస్టర్ రెగ్యులర్ ఇంటర్నల్, ప్రాక్టికల్, ప్రాజెక్ట్, వైవా పరీక్షలను నిర్వహించాలని ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీఎస్‌డబ్ల్యూ, బీబీఏ తదితర కోర్సుల ఇంటర్నల్ పరీక్షలను నిర్వహించి వచ్చేనెల 21వ తేదీలోగా మార్కుల జాబితాను సమర్పించాలని సూచించారు.

## ఘనంగా వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి



మెహిదీపట్నం, మే 7: కార్వాన్ నియోజకవర్గంలో లంగర్ హౌస్ డివిజన్‌లోని ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతి ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నిలోఫర్ కేఫ్ యజమాని అనుముల బాబూరావు హాజరై మాట్లాడుతూ హిందువులంతా ఐక్యతగా ఉండి మన దేశానికి అండగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో శాశ్వత అధ్యక్షులు బాబూరావు, ప్రస్తుత అధ్యక్షులు వెంకట మాతుర్, జనరల్ సెక్రటరీ రెడ్డి కృష్ణమూర్తి, పార్సీ లక్ష్మణ్ మాజీ అధ్యక్షులు కంచర్ల వెంకటేశ్, అమ్మవారి జయంతి చైర్మన్ ఎస్‌సీ కేశవ్. సంతోష్, వెంకటేశ్, స్వరూపరాణి, లక్ష్మీ, చంద్రకళ, రాణి, రేఖ తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్ర శిబిరాలపై దాడులు హర్షణీయం



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సుర్వీ యాదయ్యగౌడ్

రవీంద్రభారతి, మే 7 : పాకిస్తాన్‌లో ప్రేరేపిత ఉగ్రవాద స్థావరాలపై జరిపిన భారత వైమానిక దాడులు హర్షణీయమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, సర్పంచ్‌ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వీ యాదయ్యగౌడ్ అన్నారు. అమాయకులైన టూరిస్టులను ఉగ్రవాదులు పహల్గాంలో ఉగ్రవాదులు తుపాకులతో దాడి చేసి 26 మందిని అతి కిరాతంగా హతమార్చడం దారుణమన్నారు. ఈ ఉగ్రమూకలను భారత సైన్యం ఉగ్రవాదులు చేసిన దాష్టికానికి గట్టిగా సమాదానం చెప్పిన భారత సైనికులకు సెల్యూట్ చేశారు. భారత సైన్యం శత్రుదేశం పాకిస్తాన్‌కు తన సత్తా ఏమీటో చూపించిందని, భారత సైన్యానికి అభినందనలు తెలుపుతూ ఈ సమయంలో మనందరం సైనికులకు మనో ధైర్యం ఇచ్చి అండగా నిలవాలని సుర్వీ యాదయ్యగౌడ్ సూచించారు. బుధవారం సుర్వీ యాదగయ్య గౌడ్ విలేకరులతో మాట్లాడుతూ ఈ సమయంలో పార్టీలకతీతంగా భారతీయుల ఐక్యతను చాటాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ భారత సైన్యానికి అండగా నిలబడి వారి ధైర్య సాహసాలను మెచ్చుకొని ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.

## ముంపు సమస్యను పరిష్కరించాలి : కార్పొరేటర్



వరద ముంపు పరిస్థితిని అధికారులకు వివరిస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

గోల్నాక, మే 7: వరద ముంపు సమస్యను పరిష్కరించాలని అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్ సంబంధిత అధికారులను కోరారు. డివిజన్‌లోని పటేల్ నగర్‌లో చిన్న పాటి వర్షం పడ్డా ప్రేమ్‌నగర్ నాలా నుంచి వరద నీటి ఉధృతితో వరద ముంపు ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని బుధవారం జీహెచ్‌ఎంసీ డీఈ ప్రశాంతి, ఏఈ శ్రీగంధ్ తదితరులకు సమస్యను వివరించారు. వెంటనే సమస్య పరిష్కరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఎల్ అసిస్టెంట్ కమాండెంట్ త్రిలోక్ నాథ్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ నాయకులు రఫీక్, సందాని, సంతోష్‌చారి తదితరులు ఉన్నారు.

## బ్రహ్మంగారి బోధనలు ప్రపంచానికి ఆదర్శం



కాచిగూడ, మే 7: కాలజ్ఞాన మహిమను ప్రపంచానికి చాటి చెప్పిన తత్వ బోధకుడు, సంఘ సంస్కర్త పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి అని విశ్వకర్మ సంక్షేమ సంఘం అధ్యక్షులు డాక్టర్ అక్కెనపల్లి లక్ష్మణచారి, ప్రధాన కార్యదర్శి కె.ప్రసాద్ అన్నారు. అధ్యక్షుడు ఏ.లక్ష్మణాచారి ఆధ్వర్యంలో బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. నరసింహచారి, శ్రీనివాసాచారి, ఉపేంద్రచారి, రాకేశ్‌శర్మ, రామ్మోహన్ చారి, కిషన్ చారి, చంద్రశేఖర్ రెడ్డి, వెంకటయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఉగ్రవాదాన్ని అంతం చేయాల్సిందే..



మాట్లాడుతున్న బీసీ మహాసభ జాతీయ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్

కాచిగూడ, మే 7: దేశంలో ఉగ్రవాదం, ఉన్మాదం ఏ రూపంలో ఉన్న తుద ముట్టించాలని బీసీ మహాసభ జాతీయ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ అన్నారు. బుధవారం నింబోలి అడ్డ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ నిర్ణయంతో భారత సైన్యం ఎంతో నిరోచితంగా దాడులు చేసిందో అంతే అప్రమత్తంగా దేశ రక్షణలో మేము ఎవరికి తీసిపోము అన్నట్లుగా ప్రదర్శించడం చారిత్రాత్మకమని అన్నారు. భూషణ్ భాస్కర్, డాక్టర్ ప్రశాంత్ నీమ్ కర్, సత్యపాల్ సింగ్, ముత్యాలరావు, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి తరలిస్తున్న ఇద్దరు రిమాండ్



కాచిగూడ, మే 7: రైల్లో గంజాయి తరలిస్తున్న ఇద్దరిని కాచిగూడ రైల్వే పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ జావేద్, కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రం, గుల్బామ్ గ్రామానికి చెందిన దుర్యోధన్ చంప్తి కుమారుడు భగబాన్ చంప్తి(23)వృత్తిరీత్యా మోల్డింగ్ పనిచేస్తాడు. ఒరిస్సా రాష్ట్రం, గుల్బామ్‌కి చెందిన బాబులి మహంతి కుమారుడు సుమంత మహంతి (24), వృత్తి రీత్యా కూలి. వీరిద్దరూ స్నేహితులు. గత కొన్ని నెలలుగా విశాఖపట్నం నుంచి రైల్లో గంజాయిని నగరానికి తీసుకువచ్చి షాద్‌నగర్‌లో ఉండే స్నేహితుడికి అప్పగించేవారు. ఆ వ్యక్తి నగరంలోని వివిధ ప్రాంతాల్లో గంజాయిని అమ్మేవాడు. మంగళవారం విశాఖపట్నం–కాచిగూడ రైల్లో గంజాయిని కాచిగూడ రైల్వే స్టేషన్‌లో దిగి స్టేషన్ బయటికి వెళ్లడానికి భగవన్ చంప్తి, సుమంత మహంతి బ్యాగు పట్టుకొని అనుమానాస్పదంగా వెళ్తుండగా అక్కడే విధులు నిర్వహిస్తున్న రైల్వే సీఐ ఎల్లప్ప, సిబ్బంది, ఆర్పీఎఫ్ సీఐ, సిబ్బంది వారిని బ్యాగును తనిఖీ చేయగా అందులో రూ.1,57,700 విలువచేసే 3 కిలోల 154 గ్రాముల గంజాయి ఉన్నట్లు తేలింది. వెంటనే రైల్వే పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితులిద్దరిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన గంజాయి అసలు సూత్రధారుడు భవన్ సుబుది పరారీలో ఉన్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. బీజీ ప్రసాద్‌రావు, సీహెచ్ సుబ్బారావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మెహిదీపట్నం,మే 7: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన నాంపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి రైల్వే స్టేషన్ వద్ద ద్విచక్ర వాహన పార్కింగ్ ఏరియాలో ఓ వ్యక్తి మృతి చెంది ఉండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

# అక్రమ నిర్మాణాలపై హైడ్రా కొరడా



అధికారులు కూల్చివేసిన అక్రమ నిర్మాణాలు

చార్మినార్, మే 7: పేదలకు ఉపయోగపడే స్థలం అన్యాక్రాంతమవుతుండంతో స్థానికులు హైడ్రాను ఆశ్రయించారు. కందికల్‌ని కోట్లాది రూపాయల విలువైన భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా షెడ్లు ఏర్పాటు చేశారు. బుధవారం హైడ్రా అధికారులు పర్యటించి అక్రమ కట్టడాలని రెవెన్యూ అధికారులతో కలిసి నిర్ధారించారు. అనంతరం 303,306 సర్వే నెంబర్లలోని 2500 గజాల ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన షెడ్లను తొలగించి స్వాధీనం చేసుకుంది. అదే స్థలంలో స్థానికులు సయ్యద్ బషీరుద్దీన్, సయ్యద్ అమీదుల్లా హుస్సేన్‌లు ఆ స్థలాన్ని ఆక్రమించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని హైడ్రాకు ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద ఉన్న భూమిని తన పేరుమీద రెగ్యులరైజ్ చేసుకునేందుకు బషీరుద్దీన్,అమీదుల్లా పలుమార్లు ప్రయత్నాలు చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ మేరకు అక్కడ నిర్మించిన ఆర్‌సీసీ రూములు 4, రేకుల షెడ్డులు, షాపులు 4 వరకూ కూల్చివేసినట్లు తెలిపారు. అనంతరం ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేశారు.


**అడ్డుకునేందుకు యత్నం..**

హైడ్రా కూల్చివేతల సందర్భంగా స్థానిక రాజకీయ నాయకులు, కబ్జా చేయడానికి యత్నిస్తున్న వారి సహచరులు కూల్చివేతలను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. అధికారుల విధులు అడ్డుకున్న వారిని చంద్రాయణ గుట్ట పోలీసులు అక్కడి నుంచి తరలించారు. మరోవైపు ప్రభుత్వ భూమిని కాపాడగలిగామంటూ స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

## ప్రేమ విఫలం.. యువకుడు ఆత్మహత్య

కాచిగూడ, మే 7: ప్రేమ విఫలమై ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణాచారి వివరాల ప్రకారం ఉప్పుగూడ ప్రాంతానికి చెందిన వెంకటయ్య కుమారుడు కందారి ఆకాష్(23) వృత్తి రీత్యా టెంట్ హౌస్‌లో పనిచేస్తాడు. గత కొన్ని రోజులుగా అమ్మాయిని ప్రేమించాడు. అందుకు ఆమె నిరాకరించడంతో ఆకాష్ జీవితంపై విరక్తి చెంది బుధవారం యాకత్ పుర–ఉప్పుగూడ రైల్వే స్టేషన్ల మధ్య రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు లక్ష్మణచారి తెలిపారు.

## చొరబాటుదారులను బహిష్కరించాలి



మెహిదీపట్నం : మన దేశ శాంతి భద్రతలకు భంగం కలిగిస్తూ జీవిస్తున్న పాకిస్థాన్, బంగ్లాదేశ్ రోహింగ్యాలను చొరబాటుదారులపై తక్షణమే విచారణ జరిపి దేశ బహిష్కరణ చేయాలని స్థానిక గోల్కొండ మండల ఎమ్మార్వో అహల్యాకు బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్వాన్ కన్వీనర్ ఆకుల గోవర్ధన్, లంగర్ హౌస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీకాంత్ రావు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.

# 'మాకు న్యాయం చేయండి'

- ఎస్సీ కమిషన్‌కు బాధితులు ఫిర్యాదు




విలేకరులకు వివరాలు తెలుపుతున్న బాధితుడు దుగ్గిని మనోజ్, కుటుంబసభ్యులు

జియాగూడ, మే 7 : సయ్యద్ అక్బర్ నిజాముద్దీన్, ఇతని కొడుకు జాహిద్ అక్బర్‌లపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేయాలని కోరుతూ బుధవారం దోమల్‌గూడకు చెందిన దుగ్గిని మనోజ్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఫిర్యాదు చేశారు. అనంత రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దుగ్గిని మనోజ్, కుటుంబ సభ్యులు మాట్లాడారు. ఎస్సీ మాదిగ కులానికి చెందిన తమకు హైదరాబాద్‌లోని మహబూబ్‌గంజ్, మొరంబస్తీలో 600 గజాల స్థలంలో వర్క్‌షాప్ ఉంది. వర్క్ బోర్డ్ నుంచి 1955 సంవత్సరంలో మా తాత లీజుకు తీసుకున్నారు. అప్పటి నుండి స్థలం మా ఆధీనంలోనే ఉంది. గత సంవత్సరం 2024 డిసెంబర్ 30వ తేదీన నాంపల్లి ప్రాంతానికి చెందిన అక్బర్ నిజాముద్దీన్ కుటుంబ సభ్యులు గుండాలను పెట్టి మెకానిక్ షెడ్‌కున్న తాళాలు తొలగించారు. దీంతో విజయలక్ష్మి అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అయినా పోలీసులు పట్టించుకోలేదు. కోర్టులో కేసు ఉండగా గత నెల ఏప్రిల్ 23వ తేదీన వీధి రౌడీలను పెట్టి వేపచెట్టు, రాగి చెట్లను నరికి వేశారు. దీనిపై కూడా అఫ్జల్‌గంజ్ పోలీస్‌లకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు.

సయ్యద్ అక్బర్ నిజాముద్దీన్, ఇతని కొడుకు జాహిద్ అక్బర్‌లపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుటుంబసభ్యులు విజయలక్ష్మి, భాగ్యరేఖ, రేణుక , ధనరాజ్ , మనోజ్ పృధ్వీ తదితరులు పాల్గొన్నారు.

# అమ్మమ్మను చంపిన మనుమడు..

- జువైనల్ హోమ్‌కు తరలింపు

మెహిదీపట్నం, మే 7: అమ్మమ్మని చంపిన మనుమడిని మెహిదీపట్నం పోలీసులు అదుపులోకి తీసుకొని బుధవారం జువైనల్ హోమ్‌కు తరలించారు. వివరాలలోకి వెళితే... ఎన్ఎండీసీ సమీపంలోని కోటమ్మ బస్తీలో నివసించే బుజ్జి అలియాస్ లక్ష్మి(50) సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతురాలి గొంతుపై గోర్ల గాట్లు కనిపించడంతో హత్య కేసుగా నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు. మృతురాలి మనుమడు (14) బాలుడు ఆమె గొంతు నులిమి చంపినట్లుగా విచారణలో తేలింది. కుటుంబంలో జరుగుతున్న గొడవలను లక్ష్మి ఆపకుండా ఎక్కువ చేస్తుండడంతో ఆగ్రహానికి గురైన బాలుడు క్షణికావేశంలో అమ్మమ్మను గొంతు నులిమి చంపేశాడు. బాలుడిని బుధవారం అదుపులోకి తీసుకున్న పోలీసులు జువైనల్ హోమ్‌కు రిమాండ్ తరలించారు. కేసు దర్యాప్తులో ఉన్నది.


## మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

అంబర్‌పేట, మే 7 : వాసవిమాత జయంతిని పురస్కరించుకొని నియోజకవర్గ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం అంబర్‌పేట శ్రీరమణ చౌరస్తాలో ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఎండల దృష్ట్యా వాహనదారులకు మజ్జిగను అందజేసినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక చైర్మన్ కె.రాంచందర్ గుప్తా, అధ్యక్షుడు కె.శ్రీనివాస్ గుప్తా, ప్రధాన కార్యదర్శి జైన శ్రీనివాస్ గుప్తా, కోశాధికారి బి.వాసుగుప్తా, ప్రతినిధులు వి.వెంకటేశ్‌గుప్తా, హరిబాబు, ఎం.సత్యానారాయణ,ఎం.రమేశ్, వెంకటరమణ, నాగభూషణం, కె.సుధాకర్ గుప్తా, బీ. శ్రీనివాస్, జి.రవీందర్, కే. శ్రీనివాస్, మురళీధర్, చంద్రమౌళి, కిషన్, సాయిశంకర్, శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## భరతనాట్యంలో అరంగేట్రం



రవీంద్రభారతి, మే 7 : అనుశ్రీ అశ్విన్ పొన్నమ్మ చేసిన భరత నాట్య అరంగేట్రం రసరమ్యంగా సాగింది. బుధవారం రవీంద్రభారతిలో ప్రముఖ నాట్య గురువు డా. రమాదేవి నల్ల శిష్యురాలైన అనుశ్రీ అశ్విన్ పొన్నమ్మ భరతనాట్యంలో అరంగేట్రం చేసింది. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ, సీనియర్ పీడియాట్రిషియన్ డా.గిరిజాకృష్ణన్, అనురాధరెడ్డి విచ్చేసి అనుశ్రీ అశ్విన్‌ను ఆశీర్వదించారు.

## పరీక్షా ఫలితాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ తెలిపారు. ఫలితాలను www.osmania.ac.inలో చూసుకోవాలన్నారు.